# ఇందిరా గాంధీ, నేనూ రెండు దోసెలూ!

మొన్ననో కలొచ్చింది, నాక్కాదు మావారికి. ఇందిరా గాంధీగారొచ్చిందిట మాయింటికి. నేనూ మా అత్తగారూ దోసెలు పోస్తున్నాం పెనం ముందు కూర్చుని. ఆవిడ మమ్మల్ని పలకరించి రెండు దోసెలుతిని వెళ్లిపోయిందిట. సాయంత్రం ఐదూ ఏడు గంటల మధ్య అలా దోసెలు తినేందుకు ఆవిడ మాయింటికొచ్చి వెళ్ళేదట, సెక్యూరిటీ వాళ్ళు ఒరోజు మాయింటి మిదొచ్చి పడ్డారు. రోజూ ప్రధాని ఐదూ ఏడుగంటల మధ్య మమ్మల్ని తప్పించుకుని ఎక్కడికో వెళ్లిపోతున్నారు. ఇక్కడికి కొస్తున్నారు, దేనికి అని అడిగార్ట, దోసెలు తినడానికని మావారు తడుముకోకుండా చెప్పార్ట! వాళ్ళు నమ్మలేదుట. ఇదీ కల—కథ కాదు.

మావారు మమ్మల్ని వుడికించడానికి కోస్తున్నారేమో అనుకుని "ఆపేశారేం కోతలు" అన్నా, "కోతలుకావు సరస్వత్తోడు. నాకల్లోకొచిందావిడ. నువ్వే మాట్లాడావు కూడా హిందీలో" అన్నారు.

"అప్పుడు నేనేం చీర గట్టుకున్నాను?"

"వెలిసిపోయిన సిల్కుచీర".

"ఛ! ఛ! శుభ్రమైన చీర కట్టుగునుండాలిసింది. రాక రాక ప్రధాని మాయింటికొ స్తే, ఈ దిక్కుమాలిన వెలిసిపోయిన చీరతో పొయ్యిముందు తగలడ్డాను కాబోలు."

"ఏవండీ తల దువ్వుకున్నారా?''

"లేదనుకుంటాను. ముడేసుకున్నావు తరవాత తీరిగ్గా దువ్వుకో వచ్చని."

"అయ్యయయ్యయ్యో మొహమున్నా రుద్దుకుని బొట్టెట్టుకున్నానా?"

"పాపం పనిలో వున్నావు. బొట్టుకూడా చెరిగిపోయి పశ్చిమా కాశంలా నుదురంతా ఎర్రెర్రగా అయిపోయింది. మొహం తరవాత తోవు కుందావని బద్దకించి వుంటావు నీ బద్దకం నాకు తెలిసిందే కదా."

"అత్తగారెలా వుందీ!"

"మా అమ్మా! పట్టుచీర కట్టుకుని ముడిపెట్టుకుని దోసెలు పోస్తోంది. మా అమ్మ పీటవేసింది. నవ్వుతూ పిలిచి."

"పీట నేను వెయ్యలేదా ఆవిడకి."

"లేదు నువ్వావిడ్ని చూడగానే గాబరా పడిపోయావు. ఆవిడేవిటి మనింటికి రావడమేవిటని."

"అవున్లెండి నేను వెర్రి మొహాన్నే కదా!"

"కాదు ముందు ఇందిరా గాంధీగారు నీ భుజ మీదే చెయ్యివేసి చాలా పనిలో వున్నట్లున్నావు సీతా" అంది.

"నిజవండీ నా భుజంమీద చేయివేసిందా! నాపేరేలా తెలుసండీ.."

"నీ వ్యాసాలు చదివుంటుంది.''

"పోదురూ, మీది మరీబడాయి. ఆవిడకు తెలుగురాదుగా-"

"ఓసి వెర్రి మొహమా-తెలుగు రాకపోతే ఏమి ఆవిడకు సెక్రటరీ

లుంటారు. వాళ్ళు చదివి షుద్ధచేసి నూరి మాత్తర్లుచేసి ఆవిడచేత మింగిస్తారు."

"పోన్లెండి మనం ఎంత? మనరాతలెంత? ఆవిడ ఏ చీర కట్టుకుందీ? వెడల్పంచా సన్నంచా"

"ఇంకేచీర కట్టుకుంటుదే ఆవిడ, ఖద్దరుచీర....మీకుమల్లే, టెర్లిన్లూ నైలానూ నైలక్సులూ అటువంటి గొప్పవారు కట్టుకోరు."



"దిక్కుమాలి దాన్ని నేనూ ఖద్దరు చీర కట్టుకుని తగలడాల్సింది ఈ మాసిన సిల్కుచీరలో నా అవతారం చూసి ఆవిడ నవ్వుకుందో ఏమో-"

"మీకూ అలాటి ఆలోచన్లు! ఆవిడెందుకలా అనుకుంటుందీ, పాపం అమ్మాయి పనిలో వుంది కాబోలు అనుకుంటుంది."

"మీరనవసరంగా మాట్లాడకండి. నాకోపం వస్తుంది. శుద్ధ ఎడ్డిమడ్డి స్వరూపమని ఆవిడ అనుకోదూ నన్ను చూసి. అన్నట్లు మెళ్ళో ఏమన్నా వేసుకున్నానా లేకదేబెలా యిలానే నిలబడ్డానా?"

"మంగళ సూత్రాలు కూడాలేవు పొద్దున్న తలంటోసుగున్నప్పుడు బాత్రూంలో గూట్లో పెట్టి వుంటావు."

"చెవులకీ ముక్కులకీ కూడా ఏవీలేదా."

"చెవులకీ ముక్కులకీ వున్నాయి. మంగళసూత్రలే లేవు. వేసుకోకపోయినా ఫరవాలేదనే ధీమాకొద్దీ అలా పారేసుంటావు."

"ఆవిడ వచ్చినపుడు కట్టుకోడానికి నాకొక మంచి ఖద్దరు చీరైనా లేదు చూశారా?"

"నేకేమి నీ వుట్టిన రోజుకని తెస్తే చింపి దుప్పట్లు కుట్టించావుగా తెలివి!"

"రామ! రామ? ఆవిడ ఎలా వున్నారు?"

"నవ్వుతూ వచ్చిందావిడ. అమ్మ పీటవేసింది కూర్చుంది. నువ్వు దోసెలు పెట్టావు."

"ఎన్ని?"

"రెండే రెండు."

రెండేనా?

"అవును, అంతకంటె కూర్చుని తినడానికి ఆవిడకు పైమెక్కడుంటుంది. ఊపిరాడని యుద్ధం ఒకపక్క.

"కాఫీ ఏమన్నా ఇచ్చానా?"

"ఇచ్చావు వెండిగ్లాసులో-ఆవిడ వూదుకుంటూ త్రాగింది."

"పాపం, గ్లాసు వేడెక్కిపోయి వుంటుంది. అందుకేచెబుతున్నాను. నాలుగు మంచి కప్పులూ సాసర్లూ తెచ్చిపడేయండీ అని."

"తేలేదా-ఎన్ని తెచ్చినా నువ్వే పగలగొట్టేస్తావ్. నీ చేతులుమహా వదులు."

"అనందవండి అన్నిటికీ నేనొక్కర్తిని దొరికాను మీకు. నేనేగా లోకువ."

"ఏడవకు. ఆవిడకి నీకిచ్చిన పలకరింపు పెండిగ్లాసును పవిటచెంగుతో పట్టుకుని వూదుకుంటూ తాగి నీతో నవ్వుతూ కబుర్లుచెప్పి వెళ్ళిపోయింది"

"ఇంతకీ నేనావిడకు నమస్కారం అన్నా చేశానా లేదా?"

"లేదు, నీకావిడ్ని చూడగానే కాళ్ళలోంచి దడ వొణుకు బయల్దేరి వుంటాయి."

"ఛీ! పాపిష్టిదాన్ని దేశానికి నాయకురాలు యింటికొస్తే వొణికి తగలడ్డాను కావల్ను, ఆవిడ ఏమనుకుందో, ఏమిటో—"

"ఆవిడ ఏమనుకోలేదు గాని పోలీసులొచ్చారుగా వెంట." పోలీసులెందుకూ?"

"ఎందుకేవిటి? ఆవిడకు నువ్వేదో పెట్టావు. అలా నువ్వు పెట్టకూడదు, ఆవిడ తినకూడదు."

"ఎందుచేత?"

"ప్రధాని నీలాటి అడ్డమైన వాళ్ళింటికి వెళ్ళి కాఫీ ఫలారాలు చేస్తే ఇక సెక్యూరిటీ పోలీసులూ, డాక్టర్లూ ఎందుకు? వాళ్ళు నిన్ను అరెస్ట్ చేసినా చెయ్యొచ్చు.

"బావుందండీ. రెండేగా దోసెలు తింట. ఆ మాత్రానికే పోలీసులు రావాలా?"

"ఓసి వెర్రి మొహమా. ప్రధాని దోసెలు తినకూడదు. నువ్వు పెట్టకూడదు. తెలిసిందా? జాగ్రత్త" కొంచెం ఆగి

"ఇంతకి ఆవిడ కల్లోవచ్చింది. నాకుగాని నీకుకాదు."

"పోదురూ మీ బడాయిలు."

"దోసెలు పెడితే పెట్టావుగాని, ఎక్కడా అనకు పోలీసులు నిన్ను భద్రాతా చట్టంకింద మోసుకు పోతారు."

"సర్లెండికాని, శుభ్రమైన గాజు గ్లాసులు అరడజను నాలుగుకప్పులు,

సాసర్లూ పట్రండి. ఎవళ్ళన్నా పెద్ద వాళ్ళొచ్చినప్పుడు కంచు చెంబు ల్తోనూ సీల్టు గ్లాసుల్తోనూ కాఫీలి_స్తే ఏం బాగుండదు."

"చి_త్తం! చి_త్తం!"

(ఇది నిజంగా జరిగింది, ఇందలిపాత్రలు. సంభాషణలన్నియు కేవలం కల్పితం కాదు. మావారి కల్లోకి ఆవిడ ఎందుకు వచ్చిందో ఆ భారతరత్నగారినే అడగండి.—దోసెలు తిన్నమాట మాత్రం నిజం. రెండే రెండు)